# 10

# మాటే మంత్రము

"తివిరి ఇసుమున తైలంబు దీయవచ్చు
దవిలి మృగతృష్ణలో నీరు త్రాగవచ్చు
తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు
చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు..."

పక్క గదిలో మనవడు పద్యం వల్లెవేయడం వినపడి శివరామయ్య కళ్ళల్లోకి వింత మెరుపు వచ్చింది. తన మనవడేనా? ఎంత చక్కగా తెలుగు పలుకుతున్నాడు? ఎంత బాగా పద్యం చదువుతున్నాడు?

దిగులుతో... మానసికమైన నీరసంతో మంచంమీద పడుకుని ఉన్న ఆయనకి ఆ ఉత్సాహం ఎలా వొచ్చిందో ఏమో... ఓ పదేళ్ళ వయసు హఠాత్తుగా తగ్గిపోయిన వాడిలా ఉల్లాసంగా మంచం దిగాడు. గదిలోంచి బయటికి రాబోయాడు.

"ఏం కావాలి నాన్నగారూ?" సరిగ్గా అప్పుడే గది ముందు నుంచి వెళుతున్న ప్రకాశం అడిగాడు.

"అబ్బే ఏవక్కరలేదు... మన గోపి ఎంత బాగా చదువుతున్నాడో పద్యం..."

"ఐతే? వాడు చదువుకునే గదిలోకి వెళ్ళామంటే వాడి చదువు పాడవుతుంది. అసలే కుదురు తక్కువ వాడికి" హడావిడిగా బయటికి వెళ్ళిపోయాడు.

"నిజం చెప్పావు... మంచి మాట చెప్పావు" లోలోపల అనుకుంటూ వెనక్కి వెళ్ళి మంచంమీద కూచుండిపోయాడు శివరామయ్య.

కొడుకు ముక్కోపి అన్న విషయం తనకి తెలియదు గనకనా? అటు కోడలేమో ముభావంగా ఉండే మనిషి... తనకి వేళకి కాఫీ ఫలహారం భోజనం అన్నీ చూసుకుంటుంది. పాపం... ఆ లోటు చెయ్యదు. కానీ పలుకే బంగారమాయెనా పాట పాడుకోవాలని అనిపిస్తుంది ఆమెని చూస్తే ఎవరికైనా సరే... పోనీ.. మనవడినైనా బడి నుంచి వచ్చాక దగ్గర కూచోపెట్టుకుని కాసేపు కబుర్లు చెప్దామంటే వాడి ట్యూషన్లు... ఇరుగు పొరుగు పిల్లలతో వాడి ఆటలూ అన్నీ అయ్యేసరికి తనకి నిద్ర వస్తుంది. వాడూ నిద్రపోయే సమయం అవుతూనే ఉంటుంది.

తన దగ్గర మొదటి నించీ చనువు లేకపోవడంతో ఇంటికొచ్చిన అతిథిని చూసినట్టే చూస్తూ మసలుకుంటున్నాడు వాడు.

డైనింగ్ టేబుల్ దగ్గరైనా మాట్లాడుకోవచ్చు అనుకుంటే ఆ అవకాశం లేకుండా చేశారు కొడుకూ కోడలూ...

కారణం... ఇల్లంతా నున్నగా జారిపోయే టైల్స్ నేల...

“ఇలాంటి నేల మీద నడిచిన అలవాటు మీకు లేదు కదా... ఇటూ అటూ తిరిగారంటే కాలు జారిపడ్డారంటే మా పనవుతుంది” అంటూ గదిలో మంచం దగ్గరే ఓ చిన్న బల్ల వేసేశారు. గదిలోకి వేళకి కాఫీ ఫలహారం భోజనం అన్నీ తెచ్చి పెట్టేస్తారు.

సదుపాయాలతో బాగానే చూసుకుంటున్నారు. ఎటాచ్డ్ బాత్రూం ఉండనే ఉంది.

“నాన్నగారూ... హైవే మీద ఉంది మన ఇల్లు. ఈ పట్టణాల్లో ట్రాఫిక్ ఎక్కువ. మాలాంటి వాళ్ళకే నడవడం ఎంతో భయం. వీధిలోకి వెళ్ళకండి మీరు” ఈ ఊరు తీసుకొచ్చిన మొదటిరోజే చెప్పేశాడు ప్రకాశం.

ఇంట్లో అటూ ఇటూ తిరగడానికి లేదు. జారిపడే టైల్స్... బయట నడిచే జాగా లేదు. వీధిలోకి వెళ్ళడానికి లేదు. పోనీ... ఇరుగు పొరుగులో పెద్ద వయసు వాళ్ళెవరైనా ఉన్నారేమో చూసి తనకి వాళ్ళని... వాళ్లకి తనని పరిచయం ఏవన్నా చేశారా? ఏమీ లేదు... తన గదీ... తన మంచం... ఇదే లోకం.

నెల్లాళ్ళకిందట ఉన్న ఊర్నించి తండ్రిని ఇక్కడికి తన దగ్గరకి తీసుకొచ్చేశాడు ప్రకాశం. ఇన్నేళ్ళూ ఉన్న సొంత ఊళ్ళో బడిలో తెలుగు పంతులుగా... బడి...

పిల్లలు... ఇదే లోకంగా... ఇదే ప్రాణంగా ఎంతో సంతోషంతో గడిపిన వ్యక్తి... రిటైరైన బాధనించి తేరుకున్న వ్యక్తి... ఉత్సాహంతో మనసుకి ముసలితనాన్ని చేరనివ్వ కుండా రోజులు గడుపుతున్న మనిషి... అసలు... రిటైరైన రోజు ఆయన పడిన మనోవేదన అంతా ఇంతా కాదు... ఇంక నాకు జీవితం ఏముంది పద్మావతీ? అని భార్యతో అంటుంటే ఆవిడ కళ్ళు చెమ్మగిల్లాయి. చటుక్కుని తల దించుకుంది. ఆయన దిగులు పోగొట్టాలి గానీ మరింత పెంచకూడదు కదా!

"ఉద్యోగంలో చేరినది మొదలు ఆ బడితోనూ తెలుగు పాఠాలతోనూ నా ప్రాణం ముడిపడిపోయింది. నీకూ తెలుసు కదా?" గుండె లోతుల నించి వచ్చింది ప్రశ్న.

"మనకి పుట్టినది ఒక్కడే కొడుకు... కానీ ఆ భగవంతుడు ఎంతమంది పిల్లలని నాకు చేరువ చేశాడో? ఎంతో భాగ్యశాలిని అనుకున్నాను. ఈ రోజు నుంచీ నా పరిస్థితి తల్చుకోడానికే నాకు భయంగా ఉంది పద్మావతీ!"

"ఏవండీ! అలా మాట్లాడకండీ... రిటైరవ్వడం అన్నది తప్పదు కదండీ... అది సహజమే. ఇన్ని సంవత్సరాలుగా పాఠాలు చెప్పి చెప్పి అలసిపోయారు. ఈ వయసులో విశ్రాంతి అవసరం కదా!"

"నాకు ఓపిక బాగానే ఉంది. తెలుగు పాఠాలు చెప్పకుండా ముద్ద నోటికి పోదు నాకింక.".

చిన్న పిల్లవాడికి నచ్చచెపుతున్నట్టుగా అంది పద్మావతి– "రోజూ కొంత సేపు నాకు చెప్తూ ఉండండి తెలుగు పాఠాలు".

"బుద్ధిగా వింటావా మరి?"

నోటి మీద వేలు వేసుకుని తల ఊపిందావిడ. తెచ్చి పెట్టుకున్న భయం కళ్ళల్లో...

నవ్వు తొంగి చూసిందాయన మొహంలో...

అమ్మయ్యా... తనకి కావల్సింది అదే... అనుకుంటూ చిన్నగా నిట్టూర్చిందావిడ.

వాళ్ళిద్దరినీ తన దగ్గరికి వచ్చేసి ఉండమన్నాడు ప్రకాశం. ఒప్పుకోలేదు శివరామయ్య... ఎన్నేళ్ళగానో ఉన్న ఊరు... అలవాటైన మనుషులు... పరిసరాలు.. ఉండగలిగినవాళ్ళు ఇక్కడే ఉంటాంలే. ఉండలేనప్పుడు చూద్దాం అన్నాడు.

సరేనని ఊరుకున్నాడు ప్రకాశం.

✧ ✧ ✧

నిజంగానే భార్యని రోజూ ఓ గంటసేపు కుదేసేవాడు శివరామయ్య. అన్ని తరగతుల తెలుగు పుస్తకాలూ ఉన్నాయి ఆయన దగ్గర. ఒక పద్ధతి ప్రకారం వాటిలో లీనమైపోయి వివరించి చెప్తూ ఉండేవాడు. బుగ్గన చెయ్యి పెట్టుకుని ఆయన మొహంలోకి చూస్తూ అనుకునేది ఆవిడ. "ఇదొక తపస్సులా... చుట్టూ ప్రపంచాన్ని మరిచిపోయి ఆ చెప్పే పాఠంలోనే భగవంతుడిని చూసుకుంటారన్నమాట ఈయన!"

అలా అనుకున్నప్పుడు ఆవిడకి ఏనాడో అమ్మ అన్నమాటలు గుర్తొచ్చేవి... "ఏ పనిచేసినా దానిమీద శ్రద్ధ పెట్టి భగవధ్యానం చేస్తున్నటే అందులో లీనమై చేయాలి.

అప్పుడా పని సవ్యంగా జరగడమే కాదు మనసుకి తృప్తిని కూడా ఇస్తుంది. ఆ రోజుల్లో ఆ మాటలు పట్టించుకునే వయసే కాదు తనది.

అరవయ్యేళ్ళొచ్చి అడ్డగోడ పట్టుకుని నడిచినట్టు... ఇప్పుడు కళ్ళారా ఆ మాటకి అర్థం చూస్తోంది తను. తన భర్త బడిపంతులని తన అక్కచెల్లెళ్ళ భర్తలు ఇంజనీర్లు, డాక్టర్లని ఇన్నాళ్ళు ఒక చింత తన మనసులో ఏ మూలో ఉంటూ ఉండేది. పైకి ఎప్పుడూ కనపడనిచ్చేది కాదు. కాని తనెంత పిచ్చిగా ఆలోచించిందో ఇన్నాళ్ళూ అని ఇప్పుడు సిగ్గు పడుతోంది.

"ఏవిటలా చూస్తున్నావు? వింటున్నావా నేను చెప్పేది?" అడిగాడు శివరామయ్య.

ఉలికిపాటుతో కంగారుపడింది.

"ఆ... ఆ... చెప్పండి".

రోజూ పాఠాలు మాత్రమే కాక రాత్రిళ్ళు కొంతసేపు పద్యాలు చదివి వినిపిస్తుండేవాడు. సాయంత్రాలు పెరట్లోనూ ఇంటి ముంగిట్లోనూ మొక్కలకి సేవ చేసేవాడు. అదై పోగానే కామేశ్వరరావు నాగభూషణంతో కలిసి దూరంగా ఉన్న దేవాలయానికి నడుచుకుంటూ వెళ్ళి అక్కడో గంటసేపు లోకాభిరామాయణం మాట్లాడుకుని రావడం నిమిషాల్లో గడిచినట్టు గడిచిపోయేది రోజు. ఇద్దరూ తన వయసువాళ్ళే.

నాగభూషణం లలిత సంగీతం చాలా బాగా పాడతాడు. గుడి దగ్గర రోజూ రెండు మూడు పాటలైనా పాడందే ఊరుకునేవారు కారు. ఆ రజనీకరమోహనబింబము

నీ నగుమోమును పోలునటే అంటూ తన్మయత్వంతో ఆయన పాడుతుంటే శివరామయ్య కళ్ళ ముందు భార్య పద్మావతి ముఖమే కనిపించేది. పుష్ప విలాపం పాడుతుంటే మనసు కరిగిపోయేది. కామేశ్వరరావుకి సామెతలు చెప్పడం సరదా. వాళ్ళ అమ్మ, మాటకి ముందు సామెత చెప్తూ ఉండేదిట. అలా వాళ్ళ అమ్మ దగ్గర్నించి పుట్టెడు సామెతలు బుర్రలో నింపుకున్నాడు. పాటలయ్యాక సామెతలు చెప్పి నవ్విస్తూ ఉండేవాడు. తన వంతు వచ్చేసరికి పద్యాలు చదవమనేవారు.

"రాగయుక్తంగా పద్యాలు చదవడంలో నిన్ను మించినవాళ్ళు ఉండరేమో" అంటూ ఆకాశానికి ఎత్తేసేవారు. ములగచెట్టు ఎక్కించకండి నన్ను అంటూ నవ్వేసేవాడు శివరామయ్య.

అన్నీ కలగలిసి మంచి ఉత్సాహం హుషారు మళ్ళీ పుంజుకున్నాయి ఆయనలో. నైరాశ్యం ఎక్కడికిపోయిందో ఆయనకే తెలియదు. ఆ చెప్పే పాఠాలు వినిపించే పద్యాలు పద్మావతమ్మకి ఎంత ఆసక్తి కలిగించేవంటే ఆ సమయం అయ్యేసరికి ఆయన కంటే ఓ అడుగు ముందే తనొచ్చి చాపమీద సర్దుకుని కూచునేది.

రెండేళ్ళు గిర్రున తిరిగిపోయాయి వాళ్ళకి చీకూ చింతా లేకుండా. ఆ తర్వాతే పడింది పిడుగు.... భర్తతో చెప్పందే పక్కింటిక్కూడా వెళ్ళని పద్మావతమ్మ ఏకంగా పైలోకానికే వెళ్ళిపోయింది. ఆ రోజుల్లోనే వరహీనం అంటూ వంకపెట్టకుండా మనసుకి నచ్చిన సంబంధం... ఐనవాళ్ళమ్మాయి... ఇద్దరికీ ఒక ఏడాదే తేడా అయినా... పెద్దల సమ్మతంతో చేసుకున్నాడు శివరామయ్య. రిటైరయినందుకే విలవిల్లాడిపోయిన మనిషికి... తనలోని అర్ధభాగం మాయమైపోతే తట్టుకోవడం కష్టం అయింది. తండ్రిని ఒంటరిగా వదిలెయ్యకుండా తన దగ్గరకే తీసుకొచ్చేశాడు ప్రకాశం. కానీ ఆయన్ని తీసుకురావడంతో తన పని అయిపోయినట్టుగా చేతులు దులిపేసుకున్నాడు.

పొద్దున్నే ఆదరాబాదరా పడిపోతే మళ్ళీ ఎప్పుడో రాత్రి బాగా పొద్దు పోయాక ఇల్లు చేరతాడు. తండ్రి దగ్గర కూచుని కాసేపు మాట్లాడే తీరిక ఉండదు. శివరామయ్య పడుకునే గదిలో పగటి సమయంలో కూడా వెలుతురు అట్టే ఉండదు. ఉన్న ఒక్క కిటికీ చాలా చిన్నది. దానిమీదకి పక్కింటివాళ్ళ చెట్టు కొమ్మలు... పక్కింటి గోడ... ఏదైనా పుస్తకం చదువుకోవాలంటే పగలు కూడా లైట్ వేసుకోవలసిందే.

“పట్టపగలు కూడా లైట్ వేసుక్కూచుంటే కరెంటు బిల్లు కట్టే వాళ్ళకి తెలుస్తుంది” అంటూ ఓ రోజు గది ముందునించి కోడలు సునీత సణుక్కుంటూ వెళ్ళడం వినపడి మళ్ళీ ఎప్పుడూ పగటి పూట లైట్ వేయడానికి ధైర్యం చేయలేదు శివరామయ్య.

కాలమే గాయాన్ని మాన్పుతుంది అంటారు... నిజమే. కానీ ఎన్నెన్ని ఊరడింపులు కావాలి మనసుకి! ఆత్మీయ సాంత్వన వచనాలు ఎన్ని కోరుకుంటుంది ఈ వయసులో పిచ్చి మనసు! చిన్న వయసు వాళ్ళకి కాలక్షేపాలు అనేకం ఉంటాయి. తన బోటి వాడికో?

నిశ్శబ్దాన్ని భంగం చేసే ఓ చిన్న సవ్వడి కోసం... మౌనాన్ని భగ్నం చేసే ఓ స్వరం కోసం మనసుకెంత తహతహ!

తాను పిలిచే మనిషేడీ? ఇంట్లో తన దగ్గర కూచుని పలుకరించే తీరుబాటు ఎవరికుంది? తనే తప్పూ చెయ్యలేదే? భార్యని కోల్పోయిన దుదృష్టవంతుడు. ఉన్న ఊరొదిలి నగరానికి చేరిన అసహాయుడు.

ఆ భగవంతుడెందుకు ఒంటరితనమనే ఈ శిక్ష విధించాడు తనకి? ఏకాంతం మౌనం రెండూ పెద్ద వయసులో మనిషికి అవసరమే. కానీ ఎంతవరకు? మనసు తట్టుకోగలిగినంత వరకే. ఎక్కువతై ఆ మనసే గిలగిల లాడిపోదూ? వయసుతో తనని ముడిపెట్టవద్దని మనవి చేసుకోదూ? ఈ లోకంలో బండదీ మొండిదీ కూడా మనసే.... ఎంత విచిత్రం?

✧ ✧ ✧

రెండు నెలలు రెండు యుగాల్లా గడిచాయి శివరామయ్య ప్రాణానికి.

ప్రకాశం సునీతలకి ఓ పెద్ద సమస్య వచ్చిపడింది. గోపికి తెలుగు ప్రైవేట్ చెప్తున్న సావిత్రిగారు వేరే ఊరెళ్ళిపోతున్నారు. ఇంటికి దగ్గర్లో ఇంకెవరూ తెలుగు చెప్పేవాళ్ళెవరూ లేరు. ఎక్కడికో దూరాలు పంపించే ప్రసక్తే లేదు. ఇప్పుడెలా? తర్జన భర్జన పడిపోతున్నారిద్దరూ. రెండు రోజులుగా అమ్మానాన్నల ఆందోళన గమనిస్తూనే ఉన్నాడు గోపి. అందుకే చివరికిప్పుడు నోరు విప్పాడు.

“అమ్మా! నాకు తెలుగు ప్రైవేటు కోసం టీచర్ని నేనే చూసుకున్నాను. మీరేమీ వెతికే పని పెట్టుకోకండి”.

కంగారు పడిపోయింది సునీత. "అదేవిట్రా? మాకు తెలియకుండా?"

"మేము చూడద్దా టీచర్ని? నెలకెంతో ఏవిటో మేము మాట్లాడుకోవద్దా?" చిరాగ్గా చూశాడు ప్రకాశం.

"ఆయనకి డబ్బేమీ ఇవ్వక్కర్లేదు" కొండపల్లి బొమ్మల్లే తల తిప్పాడు గోపి.

వింతగా ఒకరి మొహాల్లోకి ఒకరు చూసుకున్నారు భార్యాభర్తలు.

"ఎవర్రా ఆ టీచర్?" ఆత్రుత ఇద్దరిలోనూ.

"ఇప్పుడే వస్తారు, వస్తున్నారు".

"ఎక్కడా?" వీధిగుమ్మంలోకి ఆత్రుతగా చూశారు.

"మీరు కళ్ళు మూసుకోండి. నేను చెప్పినప్పుడు తెరవండి మరి".

ఇద్దరూ కళ్ళు మూసుకున్నారు. గోపీ తెరవమన్నాకే తెరిచారు.

ఎదురుగా– మనవడి చేయి పుచ్చుకుని చిరునవ్వుతో తాతగారు. ఆయన ముఖంలో అంత వెలుగు ఇన్నాళ్ళుగా ఎప్పుడూ చూడలేదు వాళ్ళు. నేనూ ఓ గుర్తింపు పొందాను అంటున్నాయి ఆయన కళ్ళు.

ఓ పదేళ్ళు వయసు తగ్గిపోయినవాడిలా కనిపిస్తున్న ఆయన్ని ఆశ్చర్యంగా చూస్తుండిపోయారు. అమ్మా నాన్నలకెదురుగా సోఫాలో తాతయ్యని కూచోపెట్టి పక్కనే తనూ కూచున్నాడు గోపి.

"నా తెలుగు టీచర్... ఇద్దరూ నమస్తే చెప్పండి".

అయోమయంగా చూస్తున్న ఇద్దరూ చటుక్కున చేతులు జోడించారు.

మనవడిని ప్రేమగా దగ్గరికి తీసుకుంటూ మృదువైన స్వరంతో చెప్పాడు శివరామయ్య– "నిన్న నేను గదిలో కిటికీ దగ్గర నిలబడి బయటికి చూస్తూ కదుల్తున్న కొమ్మలూ రెమ్మలూ నాతో కబుర్లు చెప్తున్నట్టే అనిపించి వాటికి పద్యాలు పాడి వినిపించాను. అలా ఎంతసేపు పాడానో... గుమ్మంలో నిలబడి వీడు వింటున్నట్టే నాకు తెలియదు. కొంతసేపటికి నేను వెనక్కి తిరిగినప్పుడు మెల్లిగా నా దగ్గరికి వచ్చి ఒక్కటే మాట అడిగాడు. 'నాకు నువ్వు తెలుగు చెప్పగలవు కదా!' అని. ఎండి బీళ్ళు వారిన నేలమీద వాన చినుకు పడినట్టయింది నాకు" ఆ మాట అంటున్నప్పుడు

ఆయన గొంతులో సుళ్ళు తిరిగిన బాధ... అప్పుడు అర్థమైంది ప్రకాశానికి. అక్కడా ఊళ్ళో ఒక్కడే ఉంటే ఒంటరితనంతో బాధపడతాడని కదా ఇక్కడికి తీసుకొచ్చాడు తను. ఇక్కడ ఇంట్లో ముగ్గురు వ్యక్తులుండి కూడా ఒంటరితనమే కదా ఆయన ఎదుర్కొంటున్నది. తప్పు చేసిన భావనతో తల దించుకున్నాడు ప్రకాశం.

"మీకు ఏ శ్రమా ఇవ్వకూడదని నా ఉద్దేశ్యం నాన్నగారూ"

"నాకు తెలుసురా. నేను అర్థం చేసుకోగలను. మిమ్మల్ని తప్పుగా నేను అనుకోవట్లేదు. ఈ వయసులో పెద్దాయనని చదువు చెప్పమని అడగటం భావ్యం కాదని మీరు అనుకొని ఉండచ్చు. అందులో తప్పులేదు. కానీ రిటైరైపోయినా కూడా ఆరోగ్యం సహకరిస్తుంటే కనుక తనకి బాగా ఏ విషయంలో ఆసక్తి ఉందో... మొదటి నుంచీ ఏ పని తనకి అలవాటో అందులో కాస్తో కూస్తో కాలం గడపాలని కోరుకునే మనస్తత్వం ఉన్నవాళ్ళూ ఉంటారు. అదే వాళ్ళకి కొండంత బలం ఇస్తుందేమో? మహాభాగ్యం అని మనమంతా చెప్పుకునే ఆరోగ్యం ఇన్నేళ్ళుగా నా వెన్నంటే ఉంది. ఇప్పటికీ నాకు శారీరకంగా అనారోగ్యం ఏమీ లేదు. ఒక్కసారిగా బ్రస్తబ్దుగా అయిపోవడంతో మనసుకి తట్టుకోవడం కష్టమై... ఉన్న వయసు కంటే అధిక ముసలితనంతో మీకు కనపడుతూ ఉండి ఉంటాను. దాన్ని వదిలించుకోవాలంటే మనుషుల్లో పడాలి నేను. నా ఒంటరితనం కొంచెమైనా పోగొట్టాలని మీ అమ్మే వీడి నోట ఆ మాట పలికించిందేమోరా? నా కిప్పుడు ఎంత సంతోషంగా ఉందో తెల్సా? ఈ మూలంగానైనా మనవడు నాతో రోజూ కొంతసేపు గడుపుతాడు కదా. వెయ్యి ఏనుగుల బలం వచ్చిందిరా నాకిప్పుడు ఆ బలం ఇచ్చింది ఏ టానిక్కో కాదు. నా మనవడు" ఆయన కళ్ళల్లో మెరిసింది తడి... కానీ అది కన్నీరు కాదు... ఆనందబాష్పాలు.

*ఆంధ్రభూమి వారపత్రిక, 23 సెప్టెంబర్ 2010*